ప్రజలకు చేరువగా పోలీస్

◆ అంకిత భావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

◆ రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి

శిక్షణ డీఎస్పీలతో మాట్లాడుతున్న డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజలకు సత్వర న్యాయం అందించి వారికి పోలీసు సేవలను మరింత చేరువ చేసినప్పుడే పోలీసు శాఖపై నమ్మకం పెరుగు తుందని రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ డీఎస్పీలతో గురువారం నాడు ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సమాజం, వత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎలా వ్యహరించలి.. ప్రజలకు అందించాల్సిన సేవలు.. విధినిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, పారదర్శకత, క్రమశిక్షణ, మంచి ప్రవర్తన కలిగి ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. వత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం చూపాలన్నారు. ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాల కట్టడికి కషి చేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరస్తుల బారిన పడకుండా అవగాహన చేయడంతో పాటు వాటి నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. మహిళల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం, పోలీసుశాఖలు కషి చేస్తున్నాయని, ఆ దిశగా మహిళల రక్షణ కవచంగా దిశ యాప్ పని చేస్తోందన్నారు. దిశ కాల్స్‌కు సకాలంలో పోలీసులు సత్వరమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. నేరాలు జరుగకుండా ప్రివెన్షన్, డిటెక్షన్‌ల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, చట్టాలను ఉపయోగించి నేరాలు తగ్గేందుకు కృషి జరగాలన్నారు. గంజాయి, తదితర మాదకద్రవ్యాల నియంత్రణపై ఇప్పటికే పోలీసు శాఖ ఉక్కుపాదం మోపిందన్నారు. మత్తుపదార్థాల అనర్థాలపైనా ప్రజల్లో అవగాహన తెస్తున్నామని చెప్పారు. ఇలాంటి పూర్తి స్థాయిలో నియంత్రణ జరిగేలా ఆ శాఖల పరిధిలో పోలీసులు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు వ్యక్తిగత విషయ పరిజ్ఞానంతో పాటు చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం జరగడమే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో ఐజిపి వెంకట్రామిరెడ్డి అనంతపురం ప్రిన్సిపాల్ వి.గీతాదేవి, ఎస్పీ కె.శ్రీనివాసరావుతో పాటు ట్రైనీ డీఎస్పీలు పాల్గొన్నారు.

వానా వానా.. ఎక్కడప్పా..!

◆ జూన్ నెల ముగుస్తున్నా పడని భారీ వర్షం

◆ ముందుకు సాగని వ్యవసాయం

◆ విత్తనాల ఏకాదశి వచ్చినా విత్తనం పడని పరిస్థితి

◆ పంట సాగుపై రైతుల్లో ఆందోళన

ఆ సారి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు బాగా కురుస్తాయని, రుతుపవనాలు కూడా ముందుగానే వస్తాయని వాతవరణ శాస్త్రవేత్తలు చెప్పారు. రైతులు కూడా వర్షం, పంట సాగుపై ఆశలు పెట్టుకున్నారు. ఆ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. జూన్ నెల ముగిసినా ఇప్పటికీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెప్పకోదగ్గ పెద్ద వాన ఒక్కసారి కూడా పడలేదు. ఆరు మండలాలు మినహాయించి మిగిలిన చోట కనీసం భూమి తడిసేంత వాన కూడా లేదు. గత 10 రోజులుగా రోజూ ఆకాశం మేఘామృతం కావడం.. తరువాత గాలులు మొదలవడం.. వర్షం రాకుండా పోవడం జరుగుతోంది. ఖరీఫ్ పంట సాగుకు సమయం ముగిస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. వేసిన కొద్దిపాటి పంట కూడా వర్షం రాకపోవడంతో ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి-అనంతపురం

జూన్ 2వ వారం రాగానే రుతు పవనాలు ప్రవేశించి వర్షాలు పడుతాయి. ఈ ఏడాది మాత్రం ఆ పరిస్థితి లేదు. వానాకాలం ప్రారంభం అయ్యి నెల రోజులు పూర్తయినా ఇప్పటికీ చెప్పుకోదగ్గ వర్షం ఒక్క రోజు కూడా పడలేదు. గత వారం రోజులు వరకు కూడా ఎండవేడిమితో జనం ఇబ్బంది పడ్డారు. వారం రోజుల నుంచి రుతపవనాలు దోబూచులాడడం తప్పా చినుకు రూపంలో కిందకు దిగిందిలేదు. ఉమ్మడి జిల్లాలో ఈ పాటికే వేరుశనగ, కంది పంటల పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే సరైన వర్షం లేకపోవడంతో పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులు మొదలు కాలేదు. బోరుబావుల్లో నీరున్న రైతులు అడపాదడపా పంటలు సాగు చేస్తుండగా, వర్షాధార పంటల పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి స్థాయిలో మొదలు కాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా జిల్లా ప్రధాన పంట అయిన వేరుశనగ సాగు పూర్తిగా తగ్గింది. సాధారణ వర్షం పాతం నమోదు కావడంతో చాలా మంది వేరుశనగను వదిలేసి ఆముదం, పత్తి సాగు వైపు వెళ్తున్నారు. వీటికైతే వర్షం తక్కువగా ఉన్నా సరిపోతోందన్న భావన రైతుల్లో కన్పిస్తోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు వర్షాభావ పరిస్థితులో ఉన్నాయి. గత వారం రోజుల క్రితం కదిరి, బత్తలపల్లి, ధర్మవరం, తాడిమర్రి తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. ఇది కూడా పంటలు సాగు చేసేందుకు అవసరం అయ్యే వర్షం కాదు. మిగిలిన మండలాల్లో ఈపాటి వర్షాలు కూడా ఇప్పటి వరకూ కురవలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరాసరి 5 సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదవని పరిస్థితి ఉంది. గత వారంలో రుతపవనాలు ప్రవేశించాయని వర్షాలు బాగా కురుస్తాయని వాతవరణ శాఖ పేర్కొంది. అయితే రుతుపవనాలు ముందుకు కదలకపో వడంతో వర్షాలు కరవలేదు. ప్రస్తుతం రుతుపవనాలు వచ్చే అవకాశం కూడా కన్పించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పంట సాగుపై ఆందోళన

చినుకుజాడ లేకపోవడంతో పంట సాగుపై రైతుల్లో ఆందోళన కన్పిస్తోంది. ఇప్పటికే వరుస కరువులతో పంట నష్టాన్ని చవిచూసిన అన్నదాతలకు ఈ ఏడాది ఆదిలోనే వర్షాభావ పరిస్థితులు కన్పిస్తుండడంతో పంట సాగుపై ధైర్యం చేయలేకపోతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 9.31 లక్షల ఎకరాల్లో ఉంటుంది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇందులో ఇరవై శాతం కూడా సాగవని పరిస్థితి ఉంది. అత్యధికంగా సాగయ్యే వేరుశనగ కూడా అంతంత మాత్రంగానే విత్తనం పడింది. రోహిణి, మృగశిర కార్తెలు ఇప్పటికే ముగిశాయి. మరికొద్ది రోజుల్లో ఆరుద్ర కార్తె కూడా పోతోంది. ఈ కార్తెల్లో విత్తనాలు వేస్తే పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తుంటారు. అలాంటిది వర్షం లేకపోవడంతో రైతులు విత్తనాలు వేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. వర్షం ఇలా దోబుచులాడుతున్న సమయంలో వేరుశనగ, కంది, తదితర పంటల విత్తనాలు వేయాలా.. వద్దా.. అన్న మీమాంశలో రైతులు ఉన్నారు. వర్షం మరికొంత ఆలస్యం అయితే చిరుధాన్యాల సాగు చేయడమే మేలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. ఏది ఏమైనా ఈ వారం రోజుల్లో బలమైన వర్షం పడి పంట సాగు చేసుకునేందుకు వీలుకలుగుతుందనే ఆశతో రైతులు ఉన్నారు.

వాతావరణ బీమా విడుదల

◆ రూ.211.80 కోట్ల విడుదలకు ఆమోదం

◆ నేటి నుంచి జులై 3 వరకు అర్హుల జాబితా ప్రదర్శన

◆ జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని రైతులకు గురువారం తీపికబురు తెలిపింది. గత ఏడాది ఖరీఫ్-2022లో వాతావరణ, దిగుబడి ఆధారిత పంటల బీమా రూ.211.80 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపింది. ఆందుకు సంభందించిన అర్హుల రైతులు వివరాలను శుక్రవారం నుంచి జులై 3వ తేదీ వరకు ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ సామాజిక తనిఖీ జాబితాలో వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలపై జులై 4వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరించి వాటిని నమోదు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఖరీఫ్- 2022 డాక్టర్ వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా జాబితా ప్రకారం రూ. 211.80 కోట్లు బీమా వచ్చిందన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద వేరుశనగ పంటకు రూ.65.60 కోట్లు, బత్తాయికి రూ.101.49 కోట్లు, టమోటాకు రూ.1.4 కోట్లు వచ్చిందన్నారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి వర్షపాతం, గాలిలో తేమ, ఉష్ణోగ్రత మొదలైన అంశాలలో ప్రభావితం అయినప్పుడు మాత్రమే ఆ మండలానికి బీమా వర్తిసుందని చెప్పారు. దిగుబడి ఆధారిత బీమా కింద పత్తి పంటకు రూ.43.26 కోట్ల బీమా వచ్చిందన్నారు. దిగుబడి ఆధారిత బీమా కింద పత్తి పంట (వర్షాధరం) గ్రామం యూనిట్‌గా తీసుకుని పంట కోత ప్రయోగం చేసిన దిగుబడి ఆధారంగా బీమా ఇవ్వనున్నట్లు చెప్పారు.

అనంతపురంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఏకాదశి సందర్భంగా కదిరి లక్ష్మీ నరసింహస్వామి దర్శనార్థం క్యూలో నిల్చున్న భక్తులు

పండుగ శోభ

◆ ఉమ్మడి జిల్లాలో బక్రీద్, ఏకాదశి వేడుకలు

◆ ఈద్గాలు, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు

ప్రజాశక్తి-అనంతపురం

బక్రీద్, ఏకాదశి పండుగలు ఒకేసారి రావడంతో ఉమ్మడి జిల్లాకు పండుగ శోభ సంతరించుకుంది. సాధారణంగా ముస్లిములు, హిందువులు జరుపుకునే పండుగలు వేరువేరు రోజుల్లో వస్తుంటాయి. ఈ ఏడాది మాత్రం బక్రీద్, ఏకాదశి ఒకేసారి రావడంతో అందరూ పండుగను చేసుకున్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ రోజున ఇచ్చే ఖుర్బానీని ముస్లిములు పేదలకు అందజేశారు. ఇక ఏకాదశి పండుగను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తొలి ఏకాదశి కాకుండా విత్తనాల ఏకాదశి కావడంతో గ్రామాల్లో వేడుకలను సంబరంగా చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో ఏకాదశని పురస్కరించుకుని ప్రత్యేక జాతరలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

పంటల బీమాతో మరోసారి మోసం

◆ రూ.211 కోట్లతో ఎలా ఆదుకుంటారు.? ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2022 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను కేవలం రూ.211.80 కోట్ల చాలీచాలని పంటల బీమా విడుదల చేసి మరోసారి రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను వైఎస్‌ఆర్ బీమా కింద ఆదుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నీటి బుడగలా మారిందని విమర్శించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మేరకు వాతావరణ ఆధారిత బీమా కింద వేరుశనగ పంటకి రూ.65.60 కోట్లు, బత్తాయికి రూ.101.49 కోట్లు, టమోటాకు రూ.1.4 కోట్లు, పత్తి పంటకు రూ.43.26 కోట్ల బీమా ప్రకటించిందన్నారు. ఈ కొద్ది మొత్తంతో రైతులను ఎలా ఆదుకుంటారని ప్రశ్నించారు. జిల్లాలో 70 వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేసిన రైతులు సుమారు రూ.350 కోట్లు నష్టపోయా రన్నారు. దీంతో పాటు వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నా యన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బీమా సొమ్ము కేవలం పత్తి రైతులకు కూడా సరిపోదన్నారు. మిగిలిని రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పంట నష్టం ఆధారంగా పరిహారం సాధించుకునేందుకు రైతులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పరిశ్రమ విస్తరణ వద్దే..వద్దు..

◆ సుగ్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమ రెండవ ప్లాంట్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

◆ వద్దంటూ భోగసముద్రం పంచాయతీ ప్రజల ఉమ్మడి నిర్ణయం

◆ సమావేశాన్ని అడ్డుకుని నిరసన

◆ అర్థాంతరంగా ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ

పరిశ్రమ విస్తరణ వద్దంటూ అధికారులకు చేతులెత్తి మొక్కుతున్న భోగసముద్రం పంచాయతీ ప్రజలు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి మండలం భోగసముద్రం వద్ద ఉన్న సుగ్న స్పాంజ్ అండ్ పవర్ ప్లాంట్ ప్రతిపాదిత విస్తరణ వద్దే.. వద్దంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఇప్పటికే పరిశ్రమ కాలుష్యంతో పొలాలు పంటలు లేకుండా పోయాయని, ఇప్పుడు మళ్లీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే పూర్తిగా నష్టపోతామని ప్రజాభిప్రాయ సేకరణలో మూకుమ్మడిగా తీర్మానం చేసి అధికారులకు తెలిపారు. కాగ ప్రస్తుతం ఆ ప్లాంట్‌లో శాశ్వత ఉద్యోగులుగా పని చేస్తున్న కొందరు 2వ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడంతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి తెలుపుతున్న వారిపై గ్రామస్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం రసాభాసగా మారడంతో అధికారులు కార్యక్రమాన్ని అర్థాంతరంగా ముగించి వెళ్లిపోయారు.

రసాభాసగా ప్రజాభిప్రాయ సేకరణ

భోగసముద్రం వద్ద ఉన్న సుగ్న స్పాంజ్ అండ్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా 2వ ప్లాంట్ ఏర్పాటు కోసం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ 2006 సెప్టెంబర్ నోటిఫికేషన్ మేరకు గురువారం నాడు పరిశ్రమ ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భోగసముద్రం పంచాయతీ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలు, రెవెన్యూ, ఎంపీడీవో, సచివాలయ అధికారులు, ఎన్జీవోలు, పర్యావరణ ప్రేమికులు ఇందులో పాల్గొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా పలువురు వారి అభిప్రాయాలను నేరుగా జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. ప్రస్తుతమున్న పరిశ్రమ నుంచి వెదజల్లే కాలుష్యం వల్ల సమీపంలోని పంటపొలాలు పూర్తి స్థాయిలో దెబ్బతింటున్నాయని చెప్పారు. దీనికి తోడు కాలుష్యంతో గ్రామస్తులు చర్మ, కళ్ల సంబంధిత వ్యాధులతో రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో పరిశ్రమ విస్తరణ పేరుతో 2వ ప్లాంట్ ఏర్పాటు చేస్తే మరింత ఇబ్బందులకు గురవుతామని చెప్పారు. ఇదే సమయంలో కొందరు పరిశ్రమ ఏర్పాటు వల్ల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఈ నేపథ్యంలో విస్తరణకు అనుమతులు ఇవ్వాలని కోరారు. దీంతో ఒక్కసారిగా పరిశ్రమ ఏర్పాటును వద్దనే వారు కావాలనే వారిపై నిరసనకు దిగారు. పరిశ్రమ విస్తరణకు అనుకూలంగా అభిప్రాయం వెల్లడించిన వారిపై చెప్పులు విసిరారు. వెంటనే డీఎస్పీ సిఎం.గంగయ్య ఆధ్వర్యంలో సిఐలు లక్ష్మికాంతరెడ్డి, ఆనందరావు, శంకర్‌రెడ్డిలు సిబ్బందితో కలసి వారిని అడ్డుకున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని వారికి సర్ధిచెప్పారు.

ప్రజాభిప్రాయ సేకరణలో కూర్చీలు పైకెత్తి నిరసన

అందరూ అభిప్రాయాన్ని తెలపొచ్చు : జెసి

పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ప్రతి ఒక్కరూ వారి అభిప్రాయాన్ని తెలపొచ్చని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అభిప్రాయాలు తెలుసుకునే ప్రాంతంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం సరికాదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడించే ప్రతి అభిప్రాయాన్నీ నమోదు చేసి, ఎంఎఫ్‌కు పంపుతామన్నారు. మరో రెండు రోజుల పాటు కలెక్టరేట్ వద్దకొచ్చి కూడా అభిప్రాయాలు తెలపొచ్చన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలా.. వద్దా..? అన్నది ఎంఎఫ్‌తో పాటు ఇతర శాఖల మీద ఆధారపడి ఉంటుందని వివరించారు.

అర్థాంతరంగా ముగింపు

ఓ వైపు జాయింట్ కలెక్టర్ మాట్లాడుతుండగానే గ్రామస్తులు పరిశ్రమ వద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జెసి వారికి ఎంత సర్ధిచెప్పడానికి ప్రయత్నించినా గ్రామస్తులు వినలేదు. దీంతో అధికారులు చేసేది లేక ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అర్థాంతరంగా ఆపేసి అక్కడ నుంచి వెనుదిరిగారు.

ఉనికి కోసమే బస్సుయాత్ర : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి చేపట్టిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' బస్సు యాత్ర తుస్సు యాత్ర అయ్యిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు. కాలవ శ్రీనివాసులు తనపై వచ్చిన ఇసుక దందా ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకే బస్సు యాత్ర చేపట్టారన్నారు. ఉనికిని చాటుకునేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి నాయకులను పిలిపించి ఎన్టీఆర్ సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహించాలని భావించగా జనం లేకపోయేసరికి అక్కడ సభను రద్దు చేసి వినాయక కూడలిలో ట్రాఫిక్ జామ్ చేశారని విమర్శించారు. గతంలో 610 హామీలతో ఇచ్చిన మేనిఫెస్టోను అమలు చేయని టిడిపి నేడు గ్యారెంటీ బస్సు యాత్ర చేస్తే ఎవరు నమ్ముతారన్నారు. కాలవ మంత్రిగా ఉన్నప్పుడు వారి పచ్చ మీడియాలోనే కాలవ ఇసుక దందాపై కథనాలు వచ్చిన విషయం ప్రజలు మరచిపోలేదన్నారు.

'బస్సుయాత్ర'పై దుష్ప్రచారం : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో టిడిపికి లభిస్తున్న అపూర్వ ప్రజాదరణను ఓర్చుకోలేని నీలి మీడియా విష ప్రచారం చేస్తోందని పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన రాయదుర్గంలో ఓ వీడియో విడుదల చేశారు. టిడిపి చేపట్టిన బస్సు యాత్రను నియోజకవర్గ ప్రజలు విశేషంగా ఆదరించగా జగన్ అవినీతి సొమ్ముతో స్థాపించిన ఛానల్‌లో టిడిపి బస్సుయాత్రకు జనాలు రాలేదని ప్రసారం చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. టిడిపికి ప్రజలు, కార్యకర్తలు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైసిపిని ఘోరంగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాయదుర్గం లో కాపుపై 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇకనైనా జగన్ మీడియా తప్పుడు ప్రచారా లు మానుకోవాలని, లేకపోతే ప్రజల్లో మరింత అబాసుపాలవుతారని హితవు పలికారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రాస్తారోకో

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలో తాగునీటి సరఫరా అధ్వానంగా తయారైంది. వారానికోసారి కూడా ప్రజలకు తగినంత నీరు సరఫరా చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణ తాగునీటి అవసరాల కోసం 13 ఏళ్ల క్రితం రూ. 50 కోట్ల వ్యయంతో డాక్టర్ వైఎస్ఆర్ రక్షిత తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అయితే పైపులైన్ల లీకేజీ, విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, పైపులైన్ మరమ్మత్తులు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, తదితర కారణాలతో తాగునీరు సక్రమంగా సరఫరా చేయడం లేదు. కొత్త మోటార్ల ఏర్పాటు, పైపులైన్ లీకేజీ మరమ్మత్తుల కారణంగా పట్టణంలో 3 రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుం దని పది రోజుల క్రితం అధికారులు ప్రకటించారు. అయితే 12 రోజులైనా చాలా ప్రాంతాల్లో తాగునీరు సరఫరా కావడం లేదు.

ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న ప్రజలు

దీంతో విసుగుచెందిన పట్టణంలోని హరిజనవాడ ప్రజలు మొలకాల్మూరు రోడ్డుపై ఖాళీ బిందెలతో రాస్తారోకో, నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 రోజులుగా కాలనీకి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీరు అవసరాలకు సరిపోవడం లేదన్నారు. వారానికోసారి అర్థరాత్రి ఒంటి గంట సమయంలో కేవలం ఒక గంట నీరు వదులుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ అధికారులు తరచూ పైపులైన్ మరమ్మతులు, మోటార్ల ఏర్పాటు పనులు చేపడుతుండడంతో ఒక్కోసారి కనీసం వారం రోజులు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనికి తోడు నీరు రంగు మారి అపరిశుభ్రంగా వస్తున్నాయన్నారు. ఇకనైనా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, పురపాలక మండలి సభ్యులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

3న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 3న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో కార్మికులందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. గురువారం శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు తిప్పేస్వామి అధ్యక్షతన ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో 572 మంది కార్మికులు 23 సంవత్సరాలుగా పని చేస్తూ 800 గ్రామాలు, 12 లక్షల కుటుంబాలకు తాగునీరు అందిస్తున్నారన్నారు. అలాంటి తాగునీటి సరఫరా పథకం నిర్వహణ ఇక నుంచి నిధులు ఇవ్వమని, ఇప్పటి నుంచి నీటిని వినియోగించుకునే మున్సిపాలిటీ, పంచాయతీల నుంచే నిధులు సమీకరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌డబ్ల్యుఎస్ శాఖకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులు జారీ వల్ల కార్మికులను అభద్రత భావంలోకి నెట్టివేయడంతో పాటు, ప్రజల దాహార్తి పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో మాదిరిగానే శ్రీసత్యసాయి తాగునీటి పథకం నిర్వహణకు ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు 3 నెలల బకాయి వేతనాలు, 11 నెలల ఇఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. శ్రీసత్యసాయి తాగునీటి పథకం నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్లు ఉందన్నారు. కార్మికులకు వేతనాలు తరచూ ఇవ్వలేని పరిస్థితి ఉంటే, నిర్వహణ బాధ్యతలు కూడా స్థానిక సంస్థలే చూసుకోవాలని ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. యథాతథంగా ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వహించాలన్నారు. అందు కోసమే జూలై 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో జిల్లాలోని మేధావులు, ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా తొలి ఏకాదశి

ప్రజాశక్తి-అనంతపురం

తొలి ఏకాదశి సందర్భంగా విత్తుతున్న ఎడిఎ రవి

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం విత్తన తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాప్తాడు మండలంలో రైతు గోపాల్ పొలంలో అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ మీనల రవి, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్ ఆముదం పంటను వేసి తొలి ఏకాదశి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు రైతులందరూ కూడా విత్తనాలు ఏకాదశి సందర్భంగా సాగు ప్రారంభించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా రైతులు అందరి ఖరీఫ్ సాగు లాభదాయకంగా ఉండాలని ఆకాక్షించారు. రైతులకు ఇప్పటికే ఖరీఫ్ వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతు ముంగిటకు చేర్చామన్నారు. అంతేగాకుండా ఖరీఫ్ సాగుకు ముందే అవసరమైన పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇందుకు అవసరమైన ప్రోత్సాహం కింద ఎంపిక చేసిన రైతులకు మినికిట్స్ రూపంలో విత్తనాలు అందిస్తుందన్నారు.

సీమ పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శిగా ధనార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

ధనార్జున

రాయలసీమ ప్రాంత పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శిగా రాయదుర్గం పట్టణానికి చెందిన పోరాలు ధనార్జునను నియమించారు. ఈ సందర్భంగా ధనార్జున మాట్లాడుతూ గతంలో సంఘం జిల్లా కార్యదర్శిగా, రాయదుర్గం పద్మశాలి భావనాఋషి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా సేవలందించానన్నారు. తనకు అప్పగిం చిన బాధ్యతలను నిష్పక్షపాతంగా, నిజాయితీగా నిర్వహిస్తానని, పద్మశాలీయుల అభివృద్ధికి పాటు పడుతానని తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన సంఘ అధ్యక్షులు కొంగతి లక్ష్మీనారాయణ, కార్యదర్శి నారాయణ, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నాలుగేళ్లుగా రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను ఎండగట్టేందుకు టిడిపి చేపట్టిన బస్సుయాత్రలను విజయవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. గురువారం అనంతపురంలోని శ్రావణీ నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గంలోని ప్రవేశించనున్న బస్సుయాత్రను గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగట్టడంతోపాటు రాబోయే 2024 ఎన్నికల్లో నియోజకవర్గంలో పసుపు జెండాను ఎగురవేసేందుకు టిడిపి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జిసి.బాబు, మాజీ జెడ్పిటిసిటిసి చిదంబర దొర, నాయకులు చిదానందనాయుడు, బోయ సత్తి, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రజ సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని తగ్గిపర్తి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డికి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేస్తున్నట్లు తెలిపారు. పార్టీల కతీతంగా ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, ఎఒ పృథ్వీసాగర్, ఎంపిపి పెద్దన్న, త్రిలోక్‌నాథ్‌రెడ్డి, వైసిపి పుష్పావతి, నాయకులు రాజగోపాల్, నారా శ్రీరాములు, నారా హరి, దుద్దేకుంట రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, కన్వీనర్ శ్రీనివాసులు, పి.నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KAKINADA
O.S. No. 1127 of 2021
Between:
BODIREDLA LEELA SREE alias KAKARLAPUDI LEELA SREE
...Plaintiff
and
BALLEM VENKANNA DORA
...Defendant
To :
Ballem Venkanna Dora,
H.C. No.1336, S/o. B. Bulli Dora,
Employee, C/o. The Commandant,
14th Battalion, A.P.S.P., Ananthapuram,
Ananthapuram District, Andhra Pradesh
పై నెంబర్ దావా గ్రంథం నందు ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టువారు నుండి సమన్లు పంపించిననూ పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున సదరు ప్రతివాది అయిన మీరు **ది. 11-08-2023వ తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** పైన ఉదహరించిన శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయ్యి మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న శ్రీ కోర్టు వారికి తెలియపరుచుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమునందు విచారించి తీర్మానము చేయుదురు అని యిందుమూలముగా తెలియజేయడమైనది.
పలివెల వెంకటేశ్వరరావు, B.Com., B.L.,
అడ్వకేట్, డో.నెం. 1-12-5, మిలిటరీ రోడ్,
భానుగుడి జంక్షన్ దగ్గర, కాకినాడ.
కాకినాడ.
ది.29-6-2023
సెల్: 98488 48152

గుత్తిలో ముస్లిములను ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే వైవిఆర్

ప్రజాశక్తి-గుత్తి

ముస్లిములు బక్రీద్ వేడుకలను గుత్తిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా గుత్తి, ఆర్ఎస్, గ్రామీణ ప్రాంతాల్లో ఈద్గా మైదానాలకు వెళ్లి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపీ సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, నాయకులు డి.వన్నూరుసాబ్, మహమ్మద్ షఫీ, సుంకం రఫీ, కౌన్సిలర్లు ఫారుక్, నజీర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల, కడవకల్లు, సూరూపల్లి తదితర గ్రామాల్లో ముస్లిములు గురువారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా మసీదుల్లో బక్రీద్ పండుగ నమాజును చదివారు. ఈ సందర్భంగా కుర్బానీ గొప్పతనం గురించి వివరించారు.

పట్టుదలకు మారుపేరు ఏకలవ్యుడు

జయంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎపి ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు గురుగుంట్ల ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, టిడిపి నాయకులు

పట్టుదులతో దేన్నయినా సాధించవచ్చని రూపించిన గొప్ప వ్యక్తి ఏకలవ్యుడు నిలిచాడని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి అన్నారు. ఏకలవ్యుని జయంతిని పురస్కరించుకుని గురువారం అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాభారతంలో ఏకలవ్యుడు గురుభక్తికి నిదర్శనమన్నారు. బంకమట్టితో గురువు విగ్రహాన్ని ప్రతిష్టించుకుని విలువిద్యను నేర్చుకున్నాడన్నారు. పట్టుదలతో దేన్నయినా సాధించడాన్ని ఏకలవ్య శిష్యత్వం అంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, ఆదినారాయణ, దేవళ్ల మురళి, ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు మనోహర్, కూచిహరి, సంఘ తేజస్విని, శివ బాల, మణెమ్మ, వెంకటేష్, పావురాల శేఖర్, పూల బాషా, గోపాల్ గౌడ్, గుర్రం నాగభూషణ, చిరోల్ల రామాంజనేయులు, సున్నం శ్రీనివాసులు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : గురుభక్తి, ఏకాగ్రత, దీక్షా పట్టుదలలో ఏకలవ్యుడు అందరికీ ఆదర్శప్రాయుడని ఎపి ఎరుకల సేవాసంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు గురుగుంట్ల ప్రభాకర్ కొనియాడారు. ఏకలవ్యుని జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఎరుకల సేవాసంఘం కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఏకలవ్యుని దీక్ష, పట్టుదలను ఆదర్శంగా తీసుకుని ఎరుకల అన్నిరంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన సంఘ సభ్యులు వై.తిప్పప్ప, వై.బసప్పకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కరివేపాకు నాగరాజు, ఎం. వరప్రసాద్, వై.వివేకానంద, కమలపాడు నాగేంద్ర, జి.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో రమేష్‌రెడ్డి సేవలు మరువలేనివి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

సంస్మరణ సభలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి భార్య మధులత

అనంత విద్యారంగంలో రమేష్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్ట్స్ కళాశాలలో రాజనీతి శాస్త్ర లెక్చరర్‌గా అనేక సంవత్సరాలు పనిచేసి అకాల మరణం పొందిన నీలం రమేష్‌రెడ్డి చిత్రపటానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రమేష్‌రెడ్డి ఆర్ట్స్ కళాశాలలో పని చేసినన్ని రోజులూ విద్యార్థుల్లో నిరంతర స్ఫూర్తిని నింపారన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగస్వామి మాట్లాడుతూ విద్యార్థుల హృదయాల్లో ఇంత గొప్ప స్థానాన్ని సంపాదించుకున్న లెక్చరర్‌ని తన మిత్రుడు అని చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. డిగ్రీ అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలపై చేయాల్సిన పోరాటాలకు మార్గ మార్గదర్శకత్వం వహించారన్నారు. వెనుకుండి మమ్మల్ని నడిపారన్నారు. పూర్వ విద్యార్థి పోతుల రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తమలో ప్రజాస్వామ్య తత్వపు లోతైన బీజాలు వేశారన్నారు. బుల్లెట్ చేయలేని పని బ్యాలెట్ చేస్తుందని, రేపటి భవిష్యత్తును దర్శించే ఒక సుగుణాన్ని మాకు నేర్పారన్నారు. మరో పూర్వ విద్యార్థిని యమున మాట్లాడుతూ స్త్రీ పురుష సంబంధాల కేంద్రంగా సమానత్వాన్ని సాధించుకోవడం స్త్రీల హక్కుని ఆ దిశగా మమ్మల్ని వారు చైతన్య పరిచారన్నారు. రమేష్‌రెడ్డి భార్య మధులత మాట్లాడుతూ విద్యార్థులకు ఎంత స్ఫూర్తిగా నిలిచారో, భార్యగా, స్త్రీగా తనకూ అంతే మార్గదర్శకత్వం వహించారన్నారు. స్త్రీలను కూడా పురుషులతో సమానంగా గౌరవించే విశిష్ట లక్షణాన్ని రమేష్‌రెడ్డిలో చూశామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ వెంకట శివారెడ్డి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు ప్రగతి, జయరామిరెడ్డి, వర్ధమాన గాయకులు లెనిన్, లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థులు నరేష్, కృష్ణారెడ్డి, నాగరాజు, ఆర్ట్స్ కళాశాల ఫిలాసఫీ లెక్చరర్ జూటూరు రమేష్, చిదంబరయ్య, అబ్దుల్ బాషా, లక్ష్మీనారాయణ, శివన్న, హరి, గోవర్ధనగిరి, కానాల కృష్ణారెడ్డి, వాసు, కిషోర్, రామగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజి, శ్రీలక్ష్మి, దీవెన, తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డిని విమర్శించే స్థాయి జనసేనకు లేదు

ఉరవకొండ : నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డిని విమర్శించే స్థాయి జనసేన నాయకులకు లేదని వైసీపీకి చెందిన యువజన నాయకులు అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గురించి మాట్లాడే స్థాయి జనసేన నాయకుడు గౌతమ్‌కుమార్‌కు లేదన్నారు. హద్దులు దాటి మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండలో ఎవరికి ఓటు వేయాలో స్పష్టతలేని గౌతం నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడే స్థాయి కాదని ఎద్దేవా చేశారు. జనసేన నేత పవన్‌కళ్యాణ్ గురించి ఆలోచించడం మానేసి ఉరవకొండ అభివృద్ధి గురించి పోటీపడాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పవన్‌కళ్యాణ్ ఒక పార్ట్ టైం పొలిటీషియన్ అని తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎప్పుడో తెలుసని విమర్శించారు. పవన్ కళ్యాణ్ 175స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను పెట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరన్ బాషా, యువజన విభాగం అధ్యక్షుడు ధన్‌రాజ్, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి యం.జిలాన్‌బాషా, కార్యదర్శి వంశీ, మైనార్టీ నాయకులు వడ్ల సలీం, అన్వర్, ఎం.రఫిక్, విద్యార్థి విభాగం నాయకులు తేజా, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పరువు తీస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ : నియోజకవర్గంలోని కూడేరు, ఉరవకొండ మండలాల్లో భూకబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడుతూ పార్టీ పరువు తీస్తున్న నాయకులపై అధిష్టానం వెంటనే చర్యలు తీసుకోవాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ కుల మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ పారదర్శకంగా పాలన సాగిస్తున్నారన్నారు. అయితే నియోజకవర్గంలోని కొంతమంది వైసిపి నాయకులు భూకబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడుతూ పార్టీ పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2019 సంవత్సరం నుంచి ఉరవకొండ, కూడేరు మండలాల్లో జరిగిన భూకబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అలాగే ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో చోటు చేసుకున్న భూ అక్రమాలపై కూడా విచారిస్తే బాగుంటుందని సూచించారు. తహశీల్దార్ కార్యాలయాల్లో కూడా రికార్డుల తారుమారుపై, రిజిస్టర్ కార్యాలయాల్లో దొంగ రిజిస్ట్రేషన్లను వెలికి తీసి వాటిని చేయించుకున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వైసిపి అధిష్టానం స్పందించి నియోజకవర్గంలో చోటు చేసుకున్న భూకబ్జాలు, దౌర్జన్యాలపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

1న 'అనంత'లోకి బస్సుయాత్ర

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

టిడిపి మినీ మేనిఫెస్టోలోని భవిష్యత్తుకు గ్యారెంటీ అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి చేపట్టిన బస్సుయాత్ర వచ్చే నెల 1న అనంతపురం నియోజకవర్గంలోకి అడుగుపెట్టనున్నట్లు ఆ పార్టీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి తెలిపారు. గురువారం అర్బన్ నియోజకవర్గం కార్యాలయంలో టిడిపి శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమండ్రి మినీ మహానాడులో ప్రకటించిన అంశాలను ఇంటింటికీ తెలియజేయాలన్నారు. టిడిపిని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బస్సుయాత్ర 1వ తేదీ ఉదయం 10.30 గంటలకు జెఎన్‌టియు రోడ్డులోని టిడ్కో ఇళ్ల వద్ద నుంచి ప్రారంభమై సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, హౌసింగ్ బోర్డు, ఫెర్రర్ విగ్రహం, చెరువుకట్ట రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, గుత్తి రోడ్డు అన్న క్యాంటీన్, త్రివేణి, మరువంక, కల్లూరి సుబ్బారావు మ్యూజియం, పీస్ మెమోరియల్ హాల్, ఎన్టీఆర్ మ్యూజియం (కోర్టు రోడ్డు), మధ్యాహ్న భోజన విరామం, అనంతరం టవర్ క్లాక్, ఎన్టీఆర్ విగ్రహం, ఎర్రనేల కొట్టాల, రాజీవ్‌కాలనీ వారధి, మరాఠీకాలనీ (రచ్చబండ) రాత్రి బస అక్కడే ఉంటుందన్నారు. ఈ యాత్రలో పెద్దఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, రాష్ట్ర కార్యదర్శులు దేవళ్ల మురళి, ఆదినారాయణ, రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ స్వప్న, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, రాష్ట్ర మహిళా స్పోక్‌పర్సన్ సంగా తేజస్విని, ననగర అధ్యక్షుడు మారుతీకుమార్ గౌడ్, పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో గురువారం బక్రీద్ పండుగను ముస్లిములు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత జామియా మస్జిద్ హజరత్ షబ్బీర్ బక్రీద్ పండుగ విశిష్టతను చదివి వినిపించారు.

నార్పల : మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో గురువారం బక్రీద్ పండుగను ముస్లిములు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఖాజీ ఫయాజ్ ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ నమాజును చదివారు. ప్రతి ఒక్కరూ సుఖ, సంతోషాలతో ఉండాలని అల్లాకు వేడుకుని దువా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

బెలుగుప్ప : ముస్లిములు బక్రీద్ పండుగను మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఉదయాన్నే స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి ఆయా మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శింగనమల : మండలవ్యాప్తంగా ముస్లిములు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని దర్గాలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నమాజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కుల పెద్దలు, ముస్లిములు, తదితరులు పాల్గొన్నారు

పెద్దపప్పూరు : మండల కేంద్రంతోపాటు పెద్దయక్కలూరు, ముచ్చుకోట, వరదాయపల్లి, పెద్దపప్పూరు, నరసాపురం తదితర గ్రామాల్లో బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. సకాలంలో వర్షాలు పడి రైతులందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేసినట్లు ముస్లిం సోదరులు తెలిపారు.

ఉరవకొండ : బక్రీద్ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లిములు గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కుర్బానీ గొప్పతనం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకుని దువా చేశారు.

రాయదుర్గం: బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఈద్గాలో ముస్లిములు భక్తిశ్రద్ధలతో సంప్రదాయ పద్ధతిలో ప్రార్థనలు చేశారు. పట్టణ ఖాజీ మహమ్మద్ సైపుల్లా దేశంలో శాంతి భద్రతలు, సౌభాగ్యాలు కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బొమ్మన్‌హాల్ : మండల పరిధిలోని బొమ్మనహాల్, నేమకల్, ఉంతకల్లు, ఉద్దేహాల్, చంద్రగిరి, శ్రీధరఘట్ట, గోనేహాల్, ఏలంజి, గోవిందవాడ, దర్గావన్నూరు, తదితర గ్రామాల్లో ముస్లిములు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గుత్తి : పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గురువారం బొలెరో వాహనం బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక గాంధీనగర్‌కు చెందిన సుదర్శన్, వినోద్ బొలెరో వాహనం (గూడ్స్ వెహికల్)లో గానుగలు, బండలు వేసుకుని మిట్ట ఎక్కుతున్న సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరికి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కొత్తపేట వద్ద మరో ముగ్గురు..

మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న కృష్ణారెడ్డి తన కుమారుడు, కుమార్తెతో కలిసి తొండపాడు గ్రామంలో ఉన్న రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరారు. కొత్తపేట గ్రామ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణారెడ్డితో పాటు అతని కుమారుడు భువనేశ్వర్‌రెడ్డి, కుమార్తె మానసకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యాడికిలో మహిళకు...

యాడికి : మండల సరిహద్దు సమీపంలోని టోల్‌గేట్ వద్ద గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కోన రోడ్డులో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు సాయివరపు నాగరాజు తన భార్య నాగలక్ష్మితో కలిసి ద్విచక్ర వాహనంపై తాడిపత్రికి వెళ్లారు. అక్కడ ఓ ప్రయివేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కుమారున్ని చూసి తిరిగి యాడికి బయలుదేరారు. వాహనం టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే ఉన్నట్టుండి నాగలక్ష్మి కింద పడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. వెంటనే టోల్ అంబులెన్స్‌లో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు తెలిపారు.

వైఎస్ఆర్ బీమా చెక్కులు పంపిణీ

గుంతకల్లు : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బొజ్జమ్మ, రాజగోపాల్ కుటుంబ సభ్యులకు గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్ఆర్ బీమా పాలసీ చెక్కులు అందజేశారు. పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో నివాసం ఉండే బొజ్జమ్మ, రాజగోపాల్ ఇటీవల మృతిచెందారు. దీంతో వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన ఆర్థికసాయం చెక్కులను కుటుంబ సభ్యులు టున్న తిమ్మప్ప, హేమలత అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల్లో కుటుంబ యజమాని ప్రమాదవశాత్తూ మరణిస్తే వారి బాధ ఎవ్వరూ తీర్చలేనిదన్నారు. అలాంటి విషాద సమయంలో ఆ కుటుంబాలకు ఆసరాగా వైఎస్ఆర్ బీమా పాలసీ ఎంతో ఆర్థిక అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టిపిఆర్ఒ మోహన్, కౌన్సిలర్ లింగన్న, మార్కెట్టు యార్డు ఛైర్మన్ ఎస్‌విఆర్ మోహన్, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ సూర్యన్, వార్డు కన్వీనర్ సాంబ, వాలంటీర్లు నరేష్‌కుమార్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

గుత్తి : షుగర్ వ్యాధిగ్రస్తురాలకు రైట్స్ జోసెఫ్ మిత్రబృందం ఆధ్వర్యంలో వైద్య ఖర్చులకు గురువారం ఆర్థికసాయం చేశారు. స్థానిక పట్టణంలోని కటిక బజారులో నివాసం ఉండే కళావతి అనే మహిళ కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగించేది. అయితే ఇటీవల షుగర్ వ్యాధికి గురైంది. కాళ్లు వాపులు, గాయాలతో మంచాన పడింది. దీనస్థితిలో ఉండడంతో జోసఫ్ మిత్రులు బండల రామాంజనేయులు, డి. రామాంజనేయులు, పి.రామాంజనేయులు ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

4న టెంకాయల విక్రయానికి వేలంపాట

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి ఆలయం వద్ద టెంకాయల విక్రయించే హక్కు కోసం ఈనెల 4న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.దేవదాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో బహిరంగ వేలం ఉంటుందన్నారు. జూలై 5వ తేదీ నుంచి ఏడాది పాటు ఆలయం వద్ద టెంకాయలు విక్రయించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాల కోసం ఎంపిపి జి.విశాలాక్షి గురువారం భూమిపూజ చేశారు. అనంతరం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్‌యాదవ్, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, సర్పంచి చిదంబరి, తదితరులు పాల్గొన్నారు.

జీవో 20 విడుదలతో ఉద్యోగుల్లో హర్షం

అనంతపురం : యూనివర్సిటీల్లో పని చేసే బోధనా సిబ్బంది ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం కల్పించడంతోపాటు పదోన్నతులు కల్పించేందుకు జీవో 20నిరాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో జెఎన్‌టియులో పని చేస్తున్న బోధనా సిబ్బంది గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఉద్యోగ సంఘం నాయకులు చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు, పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ ప్రయోజనకరంగా జీఓ 20 విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఇందుకు అనంతపురం జెఎన్‌టియు అధ్యాపకుల తరపుణ సిఎం జగన్‌కు, ఉత్తర్వులు రావడానికి మొదటి నుంకి కృషి చేసిన ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

'ఉపాధి' పనుల ఆడిట్‌పై గ్రామసభలు

పుట్లూరు : మండల పరిధిలోని దోసలేడు, మడుగుపల్లి, పుట్లూరు, కడవకల్లు, బాలాపురం, తక్కలపల్లి పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఆడిట్ నిర్వహించి గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చెన్నకేశవులు, ఇన్‌ఛార్జి ఇసి విజయ్‌నాగేందర్‌రెడ్డి, టిఎలు, డిఆర్‌పిలు, ఎఫ్‌ఎలు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

అనంతపురం : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని అశోక్‌నగర్ ఈద్గా మైదానం వద్ద స్వర్గీయ కెఎం.నజీర్ జ్ఞాపకార్థం గురువారం ఏర్పాటు చేసిన రక్త దానం శిబిరాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ పండుగ జరుపుకుంటారన్నారు. ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలన్నదే బక్రీద్ పర్వదినం సందేశం అన్నారు. ఇందులో భాగంగానే ముస్లిములు బక్రీద్ రోజున తమకు తోచిన సహాయం చేస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్, వర్ఫ్ బోర్డ్ ఛైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, వైసీపీ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సైపుల్లా బేగ్, కార్పొరేటర్ లీలావతి, కో ఆప్షన్ సభ్యుడు శంశుద్దీన్, పలువురు మైనార్టీ ముఖ్య నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.లక్ష అందజేత

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని పొలికి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పోయే ఈశ్వర్ భార్య జ్యోతికి వైసిపి నాయకులు గురువారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండేళ్ల కిందట వైసిపి సీనియర్ నాయకుడు బోయ ఈశ్వర్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతి పట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి ఎంతో విచారం వ్యక్తం చేశారు. ఈశ్వర్‌కు నలుగురు ఆడపిల్లలు. వీరిలో పెద్ద అమ్మాయికి పెళ్లి కుదరడంతో పార్టీ కోసం పని చేసిన ఈశ్వర్ కుటుంబానికి సాయం చేయాలన్న కృతనిశ్చయంతో వై.విశ్వేశ్వరరెడ్డి, వై.ప్రణయ్‌రెడ్డి పెళ్లి ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థికసాయం చేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బోయ దేగేంద్ర, మాధవరెడ్డి, నాగిరెడ్డి, వరదారెడ్డి, పెద్ద వెంకటేసులు, ఎం.స్వామి, తదితరులు పాల్గొన్నారు.